బనకచర్లపై అసెంబ్లీలో చర్చకు సిద్ధం

- కెసిఆర్‌కు సిఎం రేవంత్ రెడ్డి సవాల్
- తెలంగాణ ద్రోహులెవరో? గోదావరి దొంగలెవరో తేల్చుదామా?
- 18 నెలల్లో రూ.ఒక లక్ష కోట్లకుపైగా రైతుల కోసం ఖర్చు చేశాం
- 10 ఏళ్లలో కెసిఆర్ రూ.2 లక్షల కోట్లు కాంట్రాక్టర్లకు కట్టబెట్టారు

రైతు నేస్తం కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ సిఎం, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌కు నీతి, నిజాయితీ, ధైర్యముంటే గోదావరి-బనకచర్లపై అసెంబ్లీలో చర్చ సిద్ధం కావాలని సిఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. మంగళవారం సచివాలయంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గోదావరి జలాల్లో తెలంగాణకు ద్రోహం చేసిందెవరు? కోట్లాది రూపాయలను దోచుకుందెవరు? 3 వేల టిఎంసిల నీరు సముద్రంలో కలుస్తున్నాయని, రాయలసీమకు తరలించాలని కెసిఆర్ చెప్పాకే 2016లో ఏపి ప్రభుత్వం జిఓ జారీ చేయలేదా? హంద్రీ-నీవాకు 400 టిఎంసిల నీరు తరలించేందుకు 2016లో ప్రాజెక్ట్ రిపోర్ట్, జిఓ, 2018లో వాప్కోస్ సంస్థ నియామకం జరగలేదా? అంటూ సిఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కెసిఆర్ ఇచ్చిన బోడీ సలహాలు, దిక్కుమాలిన సూచనలతోనే దరిద్రం దాపురించిందని విమర్శించారు. వంధిమాగధులతో కలిసి తనను దుర్భాషలాడించడం మానుకోవాలని కెసిఆర్‌ను కోరారు. ప్రత్యేక సమావేశాల కోసం ప్రతిపక్ష నేతగా అసెంబ్లీ స్పీకర్ కు లేఖ రాయాలని కోరారు. రెండు రోజుల పాటు గోదావరి, కృష్ణా జలాలపై చర్చించేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం 800కు పైగా టిఎంసిలు తెలంగాణకు కేటాయిస్తే 299 టిఎంసీలు సరిపోతాయని, వాటిని కూడా పూర్తిగా వాడుకోలేదని సిఎం ఆరోపించారు. కేసిఆర్ తెలంగాణ రైతాంగానికి శాశ్వతంగా మరణశాసనం రాశారని, అందుకు సంబంధించిన సంతకాలు, ఆధారాలతో సహా అసెంబ్లీకి వస్తానని చెప్పారు. తాను చేసిన తప్పేంటో చెప్పాలని కెసిఆర్ వంధిమాగధులతో చెప్పిస్తున్నారని ప్రశ్నించారు. బిఆర్ఎస్ నిర్లక్ష్యంతో పూర్తి చేయని ప్రాజెక్టులను పూర్తి చేస్తూ, అనుమతులు తీసుకుంటూ ముందుకెళ్తున్నామని అని ప్రశ్నించారు. పదేళ్లలో ధనిక రాష్ట్రం దివాలా తీస్తే, కెసిఆర్ కుటుంబం ఏ విధంగా ఆగర్భ శ్రీమంతులయ్యారో చెప్పాలన్నారు.

పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో రూ.2 లక్షల కోట్లను కాంట్రాక్టర్లకు కట్టబెట్టి ఉమ్మడి పాలనలో మొదలెట్టిన ప్రాజెక్టులేవి పూర్తి చేయలేదని సిఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. రూ.1,000 కోట్లతో పూర్తి కావాల్సిన కల్వకుర్తి, రూ.300 కోట్లతో మిగిలిన బీమా, రూ.200 కోట్లు అవసరమైన నెట్టెంపాడుతో పాటు సీతారామ, దేవాదుల తదితర ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసి తెలంగాణను ఎడారిగా మార్చారని దుయ్యబట్టారు. 18 నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.ఒక లక్షా నాలుగు వేల కోట్లను ఖర్చు చేసి తమ వ్యవసాయాన్ని పండుగ చేశామని చెప్పారు. రైతు భరోసా, ఉచిత విద్యుత్, స్ప్రింక్లర్లు, సోలార్ గిరి వికాసంలో పంపుసెట్లు, ధాన్యం కొనుగోళ్లు, సన్నాలకు బోనస్, రైతు రుణమాఫీ చేసినట్లు తెలిపారు. కెసిఆర్ కాళేశ్వరం పేరుతో రూ.ఒక లక్ష కోట్లను దోపిడీ చేశారని ఆరోపించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, బస్సులకు, పెట్రోల్ బంకులకు యాజమాన్య హక్కులు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాం కుట్టడం, అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణ, ఐకేపీ ద్వారా 8,000 కొనుగోలు కేంద్రాలు, రూ.21 వేల కోట్లు వడ్డీ లేని రుణాల కోసం అందజేసినట్టు చెప్పారు. 60 వేల ఉద్యోగాలను భర్తీ చేశామనీ, ఎక్కడైనా నిరూపించేందుకు సిద్ధమని సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనను, 18 నెలల కాంగ్రెస్ పాలనను బేరీజు వేసుకుంటూ అన్ని ఓట్ల చర్చించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

కెసిఆర్ ఎగబెట్టిన రూ.7,625 కోట్ల రైతుభరోసా నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిందని, 25,35,964 మంది రైతులకు రూ.20,617 కోట్ల రుణమాఫీ చేశామని గుర్తుచేశారు. వరి వేసుకుంటే ఉరే అని కెసిఆర్ అంటే, తాము సన్నాలకు రూ.500 బోనస్ ఇచ్చి, పండించిన వరిని చివరి గింజ వరకు కొంటున్నట్లు చెప్పారు. బిఆర్ఎస్ పాలనలో తాలు, తడి పేరుతో క్వింటాలు 10 కిలోల చొప్పున దోపిడీ చేస్తే, తాము ఆ దోపిడీ నిలువరించినట్టు తెలిపారు. రైతుభరోసా పంపిణీ కార్యక్రమం పూర్తయిందని తొమ్మిది రోజుల్లో రూ.తొమ్మిది వేల కోట్లను జమ చేసినట్టు తెలిపారు.

ఉండాలనుకుంటే అక్కడే ఉండేవాణ్ణి కదా..

బనకచర్ల పేరుతో తెలంగాణకు తీరని ద్రోహం చేసిన కెసిఆర్ తనపై దుర్మార్గంగా ఆరోపణలు చేయిస్తున్నారని సిఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు కోసం తాను బనకచర్లకు గోదావరి నీళ్లను ఇస్తున్నట్లు చేస్తున్న ప్రచారాన్ని కొట్టిపారేశారు. చంద్రబాబుతో ఉండాలనుకుంటే తాను అక్కడే ఉండేవాడినని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీకి అండగా ఉండాలని కాంగ్రెస్ లో చేరి అందరితో కదం కలిపి ముందుకెళ్తున్నట్లు తెలిపారు. సోనియాగాంధీ కాళ్లు మొక్కి, తలపెట్టి నట్టేట ముంచిన చరిత్ర కేసీఆర్‌దని విమర్శించారు.

రా.... నీ సంగతి చెబుతా

బనకచర్లపై చర్చించేందుకు ప్రతిపక్ష నేతగా కెసిఆర్ అసెంబ్లీకి రావాలని సిఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. అక్కడికి వస్తే కెసిఆర్ సంగతి చెబుతానని హెచ్చరించారు. గతంలో మాదిరిగా పోనిలే అనేందుకు పెద్దాయన జానారెడ్డి అసెంబ్లీలో లేరని చమత్కరించారు. సంగతేంటో తేల్చేందుకు తామంతా ఉన్నామని స్పష్టం చేశారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- కలెక్టర్లకు సిఎస్ రామకృష్ణారావు దిశానిర్దేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. వన మహోత్సవం, ఇందిరమ్మ గృహనిర్మాణ పథకం, ఎరువుల లభ్యత, ఆయిల్ పామ్ విస్తరణ, భూ భారతి, సీజనల్ వ్యాధులు, టీబీ ముక్త్ భారత్, వైద్య కళాశాలల అవసరాలు మొదలైన అంశాలపై జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులతో మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రజల జీవితాల్లో శాశ్వత ప్రభావం చూపేలా కలెక్టర్లు వినూత్నంగా ఆలోచించాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల, మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. వనమహోత్సవ నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకునేందుకు అన్ని జిల్లాల్లో పర్యవేక్షణ సంప్రదింపుల కమిటీ సమావేశాన్ని నిర్వహించాలని ఆదేశించారు. వనమహోత్సవంలో నాణ్యత గల మొక్కలు నాటడానికి సిద్ధంగా ఉన్నాయా లేదా అనే విషయాలను నిర్ధారించుకోవాలని సూచించారు. ఈ సారి పండ్ల మొక్కల పెంపకంపై దృష్టి పెట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన రెవెన్యూ సదస్సుల్లో 8 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయనీ, దరఖాస్తులను వ్యక్తిగతంగా పర్యవేక్షించి, మానవీయ కోణంలో వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో వ్యాపించే వ్యాధులపై కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సిఎస్ కోరారు. టిబి ముక్త్ భారత్ అభియాన్‌పై, జిల్లా కలెక్టర్లు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు, ఆస్పత్రి సూపరింటెండెంట్లు, రెడ్ క్రాస్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్లతో కూడిన కన్వర్జెన్స్ సమావేశాన్ని నిర్వహించాలని వారికి సూచించారు. రాష్ట్ర అవసరాలకు సరిపోయే ఎరువులు అందుబాటులో ఉన్నాయనీ, వాటిని సక్రమంగా పంపిణి చేసేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు ఈ సందర్భంగా వారికి సూచించారు. ఆయిల్ పామ్ తోటల పెంపకానికి జిల్లాల్లో పెద్ద ప్రాంతాలను గుర్తించి, రైతులను ప్రోత్సహించాలని ఆదేశించారు.

వేగిరం కానున్న కాళేశ్వరం న్యాయ విచారణ

- జులైలో ఘోష్ కమిషన్ నివేదిక ?

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం న్యాయ కమిషన్ విచారణ ఇక వేగం పుంజుకోనుంది. జులై 30 వరకు గడువు ఉన్న నేపథ్యంలో చైర్మన్ పిసి ఘోష్ విచారణను సాధ్యమైనంత తొందరగా ముగించాలని భావిస్తున్నట్టు తెలిసింది. ఇప్పటికే నాలుగుసార్లు విచారణ గడువును రాష్ట్ర ప్రభుత్వం పొడిగించిన సంగతి తెలిసిందే. ఘోష్ కమిషన్ అడిగిన కాళేశ్వరం ప్రాజెక్టు మినిట్స్‌ను ఇవ్వడానికి మంగళవారం తెలంగాణ క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. దీంతో ఘోష్ కమిషన్ త్వరితగతిన విచారణ పూర్తిచేయడానికి అవకాశాలు మెరుగయ్యాయి. ఇప్పటిదాకా వివిధ కోణాల్లో విచారించిన కమిషన్, విచారణ ముగించడానికి కీలక సమాచారం అవసరమైంది. అదే కాళేశ్వరం బ్యారేజీల విషయంలో గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మినిట్స్‌ను ఇవ్వాలంటూ పలు లేఖలు రాసింది. అయితే ప్రభుత్వం నుంచి ఆశించిన స్పందన రాలేదు. దీంతో ఇటీవల మూడోసారి లేఖ రాసింది. ఒకింత ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోవాలని సిఎం రేవంత్ సర్కారు గతంలో నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. ఈనేపథ్యంలో ఈమేరకు సర్కారు క్లియరెన్స్ ఇచ్చింది. కాగా కేసీఆర్, హరీష్‌రావు, ఈటల రాజేందర్ స్టేట్‌మెంట్లను సైతం రికార్డు చేసిన సంగతీ తెలిసిందే. ఇప్పటికే వచ్చిన విజిలెన్స్, ఎన్‌డిఎస్‌ఎ నివేదిక, కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) రిపోర్టు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఇచ్చిన అఫిడవిట్ల ఆధారంగా తుది నివేదికను తయారుచేసి ప్రభుత్వానికి సమర్పించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

69 డైట్ కాలేజీల్లో 4,350 సీట్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 69 డైట్ కాలేజీల్లో 4,350 సీట్లు అందుబాటులో ఉన్నాయని డీసెట్ కన్వీనర్, ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ జి రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో పది ప్రభుత్వ కాలేజీలు, 59 ప్రయివేటు కాలేజీలున్నాయని వివరించారు. కన్వీనర్ కోటాలో 3,750 సీట్లు, యాజమాన్య కోటాలో 600 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. డీసెట్ మొదటి విడతలో 3,462 మంది అభ్యర్థులకు సీట్లను కేటాయించామని వివరించారు. బుధవారం నాటికి వారు కాలేజీల్లో చేరాలని కోరారు. పాత జిల్లా కేంద్రాల్లోని డైట్ కాలేజీల్లో డీసెట్ రెండో విడత కౌన్సెలింగ్‌కు సంబంధించి ఈనెల 27 వరకు ధ్రువపత్రాల పరిశీలన కొనసాగుతుందని తెలిపారు. ఈనెల 28 నుంచి 30 వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశముందని పేర్కొన్నారు. వచ్చేనెల ఐదో తేదీన సీట్లు కేటాయిస్తామని తెలిపారు. ఇతర వివరాల కోసం www.deecet.cdse.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

తెలంగాణ విజన్ డాక్యుమెంట్ 2047 తీసుకొస్తా

- పిఎసి సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను తీసుకరాబోతున్నదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. అయితే రానున్న రోజుల్లో కేంద్రం నుంచి అనేక సవాళ్లు ఎదుర్కోబోతున్నామని పార్టీ నేతలకు సూచించారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్, జమిలి ఎన్నికల వంటి అనేక అంశాలు రాబోతున్నట్టు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో సీఎం మాట్లాడారు. కులగణన చేసి మోడీ ప్రభుత్వానికి కాంగ్రెస్ సవాల్ విసిరిందని చెప్పారు. కేంద్రం కూడా జనగణనతోపాటు కులగణన చేసే పరిస్థితికి తీసుకొచ్చామన్నారు. ఎస్సీ వర్గీకరణలో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. పార్టీ నిర్మాణంలో కార్యకర్తలు క్రియాశీల పాత్ర పోషించాలని కోరారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రియాశీలంగా పని చేయాలని సూచించారు. త్వరలో మార్కెట్, దేవాలయ కమిటీల్లో నామినేషన్ పోస్టులు భర్తీ చేయాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

ఘనంగా ఉజ్జయిని మహాకాళి బోనాలకు ఏర్పాట్లు

- అధికారులు సమన్వయంతో పని చేయాలి : మంత్రి పొన్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉజ్జయిని మహాకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని, తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని రవాణా, బిసి సంక్షేమ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. బోనాల ఏర్పాట్లపై మంగళవారం జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అధ్యక్షతన సమీక్ష సమావేశం చేపటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చారిత్రాత్మకమైన శ్రీ ఉజ్జయిని మహాకాళి అమ్మవారి జాతర బోనాల ఉత్సవాలకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పని చేసి విజయవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వం పక్షాన ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా స్థానికుల సహకారం లేకపోతే విజయవంతం కాదన్నారు. సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహాకాళి దేవస్థానంలో జులై 13న అమ్మవారికి బోనాలు సమర్పణ, 14న రంగం (భవిష్యవాణి), అమ్మవారిని అంబారిపై ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. ఆ రెండ్రోజుల్లో సందర్శకులు లక్షల్లో తరలివస్తారని, కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా 13న దేవాలయంలో సందర్శకులకు అమ్మవారి దర్శనం కల్పించాలని దేవాలయ, పోలీస్ అధికారులకు సూచించారు. గత జాతర అనుభవాలను దృష్టిలో ఉంచుకొని అధికారులందరూ సేవాభావంతోపాటు బాధ్యతాయుతంగా పనిచేయాలని చెప్పారు. 14న అంబారీ ఊరేగింపులో తొక్కిసలాట జరగకుండా పకడ్బంధీగా చర్యలు చేపట్టాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం బోనాల ఉత్సవాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఇప్పటికే నిధులు మంజూరు చేసిందని మంత్రి చెప్పారు. గోల్కొండ, బల్కంపేట ఎల్లమ్మ, శ్రీఉజ్జయిని మహాకాళి, లాల్ దర్వాజా బోనాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. నిరంతర విద్యుత్, తాగునీరు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, తాగు నీటి నిల్వల పరిశీలన, పారిశుధ్య పనులతోపాటు మొబైల్ టాయిలెట్స్, సీసీ కెమెరాల నిర్వహణ ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ఆలయ ఈవోతో పాటు సంబంధిత శాఖల అధికారులను మంత్రి ఆదేశించారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. ఉజ్జయిని మహాకాళి బోనాలు అంటేనే తెలంగాణకు ప్రత్యేకమన్నారు. వివిధ శాఖల అధికారులు పోలీసు అధికారుల సర్వీసును ఈ జాతరలో ఉపయోగించుకోవాలన్నారు. విద్యుత్, రోడ్డు భవనాలు, దేవాదాయ, రెవెన్యూ, జిహెచ్ఎంసి, హెచ్ఎండిఎ, పోలీస్, అగ్నిమాపక, ఆరోగ్యశాఖలతో ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్‌తో కలిసి మంత్రి సమీక్షించారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ సుచిత్ర శ్రీకాంత్, దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్ వెంకట్రావు, అడిషనల్ సిపి విక్రంసింగ్ మాన్, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, పిసిసి ఉపాధ్యక్షులు కోట నీలిమ, వివిధ శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మీ సేవా ఉద్యోగులకు లెటర్ ఆఫ్ ఆఫర్‌ను ఉపసంహరించాలి

- ఐటి ముఖ్య కార్యదర్శికి మీసేవా ఎంప్లాయిస్ యూనియన్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్లోబస్ ఇన్ఫర్మేటిక్స్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్ ఏజెన్సీ 01-10-2022 తేదీతో "లెటర్ ఆఫ్ ఆఫర్"ను జూన్ 20, 2025 నుంచి మీ-సేవా ఎంప్లాయిస్‌కు మెయిల్స్ పంపడాన్ని తెలంగాణ మీ సేవా ఎంప్లాయిస్ యూనియన్ తప్పుబట్టింది. ఆ లెటర్‌ను ఉపసంహరించుకునేలా ఆ సంస్థపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఐటి ముఖ్య కార్యదర్శికి ఆ యూనియన్ బృందం వినతిపత్రం అందజేసింది. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు జె వెంకటేశ్, అధ్యక్షులు ఆర్ సురేశ్, ప్రధాన కార్యదర్శి జెనీమా, కోశాధికారి ఎవిబి లక్ష్మీ, ఉపాధ్యక్షులు బాల్‌రాజ్, సహాయ కార్యదర్శి కవిత, తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1999 నుండి 2012 వరకు మీ-సేవా సెంటర్లు ప్రజలకు అనేక సేవలందించాయని వారు గుర్తుచేశారు. 2013 నుంచి ఈ-సేవా కేంద్రాలను "మీ-సేవా"గా నాటి ప్రభుత్వం మార్పు చేసిందనీ, 2014 నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఈఎస్‌డి పరిధిలో మీ-సేవా సిబ్బంది సుమారు 600 మంది పనిచేస్తున్నారని తెలిపారు.

పోలవరం పాపం బిజెపిదే..!

- బ్యాక్ వాటర్ సమస్యకు పరిష్కారం చూపాలి
- ఐదు పంచాయతీలతోనే భద్రాచలం అభివృద్ధి : బండారు రవికుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓట్ల కోసం అనునిత్యం రామ నామ జపం చేసే బిజెపి ప్రభుత్వం పోలవరం నిర్మాణానికి నిధులను విడుదల చేస్తూ, శ్రీరాముని గుడిని, భద్రాచలం పట్టణాన్ని గోదావరిలో ముంచే పాపానికి ఒడిగడుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవికుమార్ ఆరోపించారు. మంగళవారం సిపిఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ మూడోసారి అధికారం చేపట్టాక భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ ప్రజాస్వామ్యాన్ని, ఫెడరలిజాన్ని దెబ్బతీస్తోందని విమర్శించారు. ప్రతిపక్షాలపై సిబిఐ, ఇడి తదితర సంస్థలను ప్రయోగించి బెదిరిస్తుందని అన్నారు. ప్రశ్నించిన వారిపై అర్బన్ మావోయిస్టులు పేరుతో జైలుకు తరలిస్తున్నారని ఆరోపించారు. అధికారం కోసం కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య ఘర్షణలను పెంచుతూ అప్రకటిత ఎమర్జెన్సీని కొనసాగిస్తుందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పేరుతో ఏడు మండలాలను ఆంధ్రాలో కలిపి భద్రాచలం ప్రాంతానికి తీవ్ర నష్టం చేసిందని తెలిపారు. పోలవరం పూర్తయితే బ్యాక్ వాటర్‌తో భద్రాచలానికి ముప్పు తప్పదని ఇంజనీర్ల బృందం స్పష్టం చేసినప్పటికీ నివారణకు మాత్రం కేంద్ర ప్రభుత్వం ముందుకు రావడం లేదన్నారు. భద్రాచలం అభివృద్ధికి ముడిపడి ఉన్న ఐదు పంచాయతీలను భద్రాచలంలో కలపడానికి కూడా ఆసక్తి చూపటం లేదని తెలిపారు. భద్రాచలం అభివృద్ధి చెందాలంటే కచ్చితంగా ఐదు పంచాయతీలను తెలంగాణలో కలపాల్సిందేనని స్పష్టంచేశారు. పోలవరంతో భద్రాచలానికి వచ్చే ముంపుపై సిపిఎం 2005 నుంచి ఉద్యమాన్ని ప్రారంభించిందని, ఆ ఉద్యమంలో ఎన్నో కేసులను ఎదుర్కొని జైలు జీవితాన్ని సైతం పార్టీ కార్యకర్తలు అనుభవించారని గుర్తు చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కండ్లు తెరిచి పోలవరం ముంపుపై నిపుణుల సూచనలను పరిగణనలోకి తీసుకొని అఖిలపక్షం ఏర్పాటు చేసి ఉద్యమాన్ని ప్రారంభించాలని కోరారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు వీలైనంత త్వరగా చర్చించుకొని ఐదు పంచాయతీల సమస్యను కూడా పరిష్కరించాలని అన్నారు. భద్రాచలం పట్టణ సమస్యలపై పార్టీ వార్డు కమిటీల ఆధ్వర్యంలో అధ్యయనం చేసి పరిష్కారానికి దశల వారి పోరాటాలను రూపొందిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్, సున్నం గంగా, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎర్రం శెట్టి వెంకట్రామారావు, పారిల్లి సంతోష్ కుమార్, డి సీతాలక్ష్మి, పార్టీ పట్టణ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చుక్క రాములు

కార్మికులకు అండగా ఉండే సిఐటియునే గెలిపించండి

- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మికులకు అండగా ఉండే సిఐటియునే గెలిపించాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు, పరిశ్రమ కార్మిక సంఘం యూనియన్ అధ్యక్షులు చుక్క రాములు పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా ఐడిఎ బొల్లారంలోని కాజిపల్లిలోని టిఐడిసి పరిశ్రమలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. నిత్యం కార్మికులకు అండగా ఉండే సిఐటియునే గెలిపించాలని, చుక్క గుర్తుకే ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే పరిశ్రమలో నాలుగు వేతన ఒప్పందాలు చేశామని తెలిపారు. కార్మికుల కోసం అనేక సౌకర్యాలు సాధించిన చరిత్ర సిఐటియుకే ఉందన్నారు. మరో అగ్రిమెంట్‌తో పాటు కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బి మల్లేష్, జిల్లా నాయకులు కె.రాజయ్య, జనరల్ సెక్రెటరీ భాస్కర్ రెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మాణిక్యం, రానే బ్రేక్ వేణుగోపాల్, మ్యాట్రిక్స్ నాయకులు శ్రీనివాస్, యూనియన్ నాయకులు శేఖర్, వెంకటేశ్వర్లు, సత్తయ్య, సుధాకర్, జానీ, ప్రభాకర్, శ్రీకాంత్ రెడ్డి, జగన్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు లాసెట్ ఫలితాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో లా కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం ఈనెల ఆరోతేదీన నిర్వహించిన లాసెట్ రాతపరీక్ష ఫలితాలు బుధవారం విడుదల కానున్నాయి. ఈ ఫలితాలను బుధవారం మధ్యాహ్నం 3.30 గంలకు హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్‌లో ఉన్నత విద్యామండలి చైర్మన్ వి బాలకిష్టారెడ్డి, ఒయు విసి కుమార్ మొలుగారం విడుదల చేస్తారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్లు ఇటిక్యాల పురుషోత్తం, ఎస్‌కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, లాసెట్ కన్వీనర్ బి విజయలక్ష్మి తదితరులు పాల్గొంటారు. ఈనెల ఆరోతేదీన నిర్వహించిన లాసెట్‌కు 57,715 మంది అభ్యర్థులు దరఖాస్తు చేస్తే 45,609 (79.02 శాతం) మంది హాజరయ్యారు.

పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పాలిటెక్నిక్, డిప్లొమా, వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. ఈ మేరకు పాలిసెట్ ప్రవేశాల కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన మంగళవారం ఒక విడుదల చేశారు. ఈనెల 26 నుంచి 29 వరకు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని వివరించారు. అదేనెల 26 నుంచి వచ్చేనెల ఒకటో తేదీ వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశముందని పేర్కొన్నారు. మొదటిరోజు 11,613 మంది ప్రాసిసెంగ్ ఫీజు చెల్లించి ధ్రువపత్రాల పరిశీలన కోసం స్లాట్ బుకింగ్ చేసుకున్నారని వివరించారు. ఇతర వివరాల కోసం https:// tgpolycet. nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించండి

- 'తెలంగాణ ఫ్రెంచ్' మధ్య ద్వైపాక్షిక సహకారం
- 'ఇఫ్కీ' రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించబోతున్న ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టేలా ఫ్రెంచ్ కంపెనీలను ప్రోత్సహించాలని 'ఇండో ఫ్రెంచ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ (ఇఫ్కీ)' ప్రతినిధులను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఇఫ్కీ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటుకున్న అనుకూలతలు, ప్రభుత్వం తరపున అందిస్తున్న ప్రోత్సాహకాలను ఈ సందర్భంగా మంత్రి వారికి వివరించారు. తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేయాలనే దూరదృష్టితోనే ప్రభుత్వం 30వేల ఎకరాల్లో పిపిపి విధానంలో ఫ్యూచర్ సిటీకి శ్రీకారం చుట్టిందని తెలిపారు. "ఏడాదిన్నర వ్యవధిలోనే తెలంగాణకు రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులొచ్చాయి. గతేడాది హైదరాబాద్‌లో 70 జిసిసిలు ప్రారంభమయ్యాయి. పారిశ్రామికవేత్తలకు మా ప్రభుత్వంపై ఉన్న నమ్మకానికి ఇది నిదర్శనం. పరిశ్రమలకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ప్రతిభ గల మానవ వనరులకు కొరత లేదు. వేగంగా, పారదర్శకంగా అనుమతులిచ్చేందుకు టీజీ ఐపాస్‌ను ఏఐతో అనుసంధానం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం' అని చెప్పారు. ఇప్పటికే ఏరోస్పేస్, ఫార్మా, ఫుడ్ ప్రాసెసింగ్, ఐటీ లాంటి రంగాల్లో పలు ఫ్రెంచ్ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టాయని గుర్తు చేశారు. సనోఫి, మోనిన్, సఫ్రాన్, క్యాప్ జెమినీ, డసాల్ట్, టెలీ పర్‌ఫార్మెన్స్, ఓపెల్లా హెల్త్ కేర్ లాంటి దిగ్గజ సంస్థలు తమ కార్యకలాపాలను ఇక్కడ నిర్వహిస్తున్నాయని అన్నారు. ఎమర్జింగ్ టెక్నాలజీస్, క్లీన్ ఎనర్జీ, గ్రీన్ మొబిలిటీ, డిజిటల్ గవర్నెన్స్, ఆగ్రో ఇన్నోవేషన్, స్మార్ట్ హెల్త్ సిస్టమ్స్, ఫ్యూచర్ రెడీ ఎడ్యుకేషన్, సస్టైనబుల్ మ్యానుఫాక్చరింగ్ తదితర రంగాల్లో మంచి భవిష్యత్ ఉందని శ్రీధర్‌బాబు చెప్పారు. ఈ రంగాల్లో ఉన్న అవకాశాలను ఫ్రాన్స్ పారిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకునేలా చొరవ చూపాలని ఇఫ్కీ ప్రతినిధులను కోరారు. 'తెలంగాణ ఫ్రెంచ్' మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని మరింత మెరుగుపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇఫ్కీకి చెందిన ప్రతనిధులు యోహాన్ సామ్యూల్, ప్రియాంక్ ప్రకాష్, నకుల్ దల్వాలా, మోనిన్, ఓపెల్లా హెల్త్ కేర్, సఫ్రాన్ ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ ఇండియా, సనోఫీ ఇండియా, టెలిపర్ ఫార్మెన్స్, వార్ ఎలక్ట్రోకెమ్ ప్రైవేట్ లిమిటెడ్, జీగ్లర్ ఏరోస్పేస్ తదితర పలు ఫ్రెంచ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మరిన్ని పెట్టుబడులకు ముందుకొచ్చిన 'సఫ్రాన్'

ఫ్రెంచ్ విమాన ఇంజన్ల తయారీ సంస్థ సఫ్రాన్ రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చింది. ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న సఫ్రాన్ హైదరాబాద్ లో ఇప్పటికే రెండు ప్రపంచస్థాయి ఉత్పాదక కేంద్రాలను ఏర్పాటు చేసింది. తాజాగా మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో సఫ్రాన్ జనరల్ మేనేజర్ పియరీ ఫెర్నాండెజ్ కొత్త పెట్టుబడులను ప్రతిపాదించారు. నూతనంగా సఫ్రాన్ ఎయిర్ క్రాఫ్ట్ ఇంజన్ సర్వీసెస్ అనే కొత్త కంపెనీని నెలకొల్పనున్నట్టు వెల్లడించారు. రఫేల్, ఎం 88 ఫైటర్ జెట్ ఇంజన్ల నిర్వహణ, ఓవర్ హాలింగ్ పనులను సఫ్రాన్ చేపడుతుంది. దీనివల్ల వచ్చే ఏడాది చివరి నాటికి 150 కొత్త ఉద్యోగాలు లభిస్తాయి. తర్వాత దశల్లో మరో 750 ఉద్యోగాలు వస్తాయి. రఫేల్ యుద్ధ విమానాల ఇంజన్లకు కీలక విడిభాగాలను సఫ్రాన్ తయారు చేస్తుంది. ఇక్కడి నుంచే ఇతర దేశాలకు సరఫరా చేస్తుంది.

మహారాజశ్రీ 4వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి మరియు ప్రధాన కుటుంబ న్యాయస్థానముల కోర్టు, విజయవాడ

FCOP (M.C) No. 850/2024

మంగళగిరి నాగమణి @ ఆవుల చందన
భర్త: ఆవుల రజనీకాంత్
తండ్రి: మంగళగిరి కృష్ణమూర్తి,
డో.నెం. 102/1, మసీదు వెనుక, నిడమానూరు గ్రామము,
విజయవాడ రూరల్ మండలం ...పిటీషనర్
మరియు
ఆవుల రజనీకాంత్,
తండ్రి: ధర్మరావు
డో.నెం. 7-137, ప్లాటు నెం.3,
ప్రశాంతి గోల్డెన్ హిల్స్, నిజాం పేట,
కె.వి. రంగారెడ్డి జిల్లా, తెలంగాణా రాష్ట్రం
...రెస్పాండెంట్

యిందు పిటీషనరు రెస్పాండెంటు అయిన మీపై మనోవర్తి కొరకు పిటీషను దాఖలు చేసియున్నారు. శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం ది. 11-07-2025 తేదీకి వాయిదా వేయున్నారు. సదరు తేదీకి మీరు ఉదయం గం॥ 10.30 ని॥లకు స్వయంగా హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. సదరు తేదీన మీరు గైర్హాజరైన ఎడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున తీర్మానము చేయుదురు.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా: 11-07-2025
ఉదయం గం॥ 10.30 ని॥లకు

BEFORE THE HON'BLE ADDL. LXXXIV CITY CIVIL AND SESSIONS JUDGE (CCH-85) BENGALURU

Comm. A.A. No. 111/2025

IN THE MATTER OF
M/s. CATERPILLAR FINANCIAL SERVICES INDIA PVT. LTD., Ground Floor, Prestige Shantiniketan, Crescent 1, Whitefield Road Hoodi, Whitefield Bengaluru, Bengaluru Urban, Karnataka-560048.
...APPLICANT
AND : Shaik Younus & Anr. ...RESPONDENTS
Service of Court Summons to Respondent No. 2 through Paper Publication
R2 : 1. AMTULLA ASIYA,
12-2-417/B/3/3, Gudimalkapur, Asif Nagar, Hyderabad, Telangana - 500028.

Whereas the Applicant has filed the above Application against you to provide adequate security to the Applicant Company equivalent to an amount of **Rs. 27,41,273/-** so as to cover the outstanding loan amount due to the Applicant Company. Take notice that the above case is posted for your appearance **on 25.07.2025.** If you have any defence, you are required to appear before the court either in person or through advocate, duly authorised on the aforesaid date of hearing, failing which the matter will be decided on merits placing you ex-parte.

SCHEDULE OF VEHICLE
A. SCHEDULE

Equipment	: Caterpillar 424-03
Maker's Name	: Caterpillar
Model No.	: 424-03
Serial No.	: JTY02551

Given under my hand and seal on this 13th day of June 2025 at Bangalore.

By order of the Court, Senior Sheristedar, Commercial Court Unit, City Civil Court, Bengaluru.

Advocate for Applicant :
#117, Ashwin Arcade, 3rd Floor,
Sanjay Nagar Main Road, RMV II Stage,
Ashwathnagar, Bangalore, Karnataka-560094.

డాక్యుమెంట్స్ పోయినవి

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, షమీర్‌పేట్ మండలం, పెరల్ టౌన్ పార్క్, ప్లాట్ నెం. 137 కి చెందిన పి. మేరి వసంతకుమారి W/o. టి. సిలాస్ పౌల్ అను నా యొక్క ఒరిజినల్ సేల్ డీడ్ డాక్యుమెంట్స్ పోయినవి. డాక్యుమెంట్స్ నెం. 1473/2012. Regd at S.R.O శంషాబాద్ On Dated 12-04-2012 డాక్యుమెంట్స్ నెం. 8742/2018. Regd at S.R.O షమీర్‌పేట్ On Dated 27-12-2018 ది. 21-04-2025వ తేదీన నా ఇంటి వద్ద దొంగిలించబడ్డాయి. దొరికినవారు ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

మేరి వసంతకుమారి
W/o: టి. సీలాస్ పౌల్
ప్లాట్ నెం: 411, BDL ఫ్రెండ్ రెసిడెన్సీ
ఉస్మాన్ నగర్ రోడ్, మేఫెయిర్ విల్లాస్ దగ్గర
తెల్లాపూర్, సంగారెడ్డి తెలంగాణ - 502032
సెల్ నెం: 81432 84580

అమెరికా పెద్ద యుద్ధోన్మాది

- ఈ దాడిని మోడీ ఖండించాలి
- ప్రపంచ శాంతిని నెలకొల్పాలి
- వామపక్ష పార్టీల నేతల డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇరాన్‌పై అమెరికా సామ్రాజ్యవాదం సాగిస్తున్న దాడులను వామపక్ష పార్టీల నాయకులు తీవ్రంగా ఖండించారు. యుద్ధోన్మాదాన్ని తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. ఇంతకాలం పరోక్ష పాత్ర పోషించిన అమెరికా ఇప్పుడు వివిధ దేశాలపై నేరుగా దాడులకు తెగబడడం గర్హనీయమని అన్నారు. ఇరాన్‌పై అమెరికా దాడులపై భారత ప్రధాని మోడీ ఖండించాలని, ఈ దాడులపై ఆయన వైఖరి ప్రకటించాలని చెప్పారు. ప్రపంచ శాంతిని నెలకొల్పాలని కోరారు. ఇరాన్‌పై అమెరికా దాడులను వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని నారాయణగూడలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. 'అమెరికా సామ్రాజ్యవాదం నశించాలి, ఇరాన్‌పై యుద్ధం ఆపాలి, అప్ అప్ సోషలిజం, డౌన్‌డౌన్ కాపిటలిజం'అంటూ పెద్దఎత్తున నినాదాలు చేయడంతోపాటు ప్లకార్డులను ప్రదర్శించారు.

మూడో ప్రపంచ యుద్ధంవైపు ప్రయత్నిస్తున్న ట్రంప్ : కూనంనేని

అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్ మూడో ప్రపంచ యుద్ధంవైపు నడిపించే ప్రయత్నం చేస్తున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. అందులో భాగంగానే రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని పరోక్షంగా ప్రోత్సహించారని గుర్తు చేశారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడి చేసేందుకు ట్రంప్ సహకరించారని అన్నారు. తాజాగా ఇరాన్‌పై ఇజ్రాయిల్ యుద్ధానికి పుర్పిగొల్పారని చెప్పారు. ఇరాన్‌లో అణ్వాయుధాలున్నాయనే పేరుతో అమెరికా బాంబుల వర్షం కురిపించడం దుర్మార్గమన్నారు. కశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో పాకిస్తాన్ ఉగ్రవాదుల శిబిరాలపై భారత సైన్యాలు అపరేషన్ సిందూర్ చేపట్టాయని చెప్పారు. భారత్‌కు ట్రంప్ మద్దతు పలికినట్టే పలికి రెండు రోజుల్లోనే పాకిస్తాన్‌కు అండగా నిలిచారని అన్నారు. ఇంకోవైపు ఇరు దేశాల మధ్య కాల్పుల విమరణ తనవల్లే సాధ్యమైందంటూ ప్రకటించారని చెప్పారు. భారత సార్వభౌమాధికారాన్ని ట్రంప్ కించపర్చినా ప్రధాని మోడీ మాత్రం ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. మూడో ప్రపంచ యుద్ధంవైపు ప్రయత్నిస్తున్నా మోడీ నోరుమెదపడం లేదని అన్నారు. భారత్ అలీన విధానానికి పూర్తి భిన్నంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అమెరికా చేస్తున్న యుద్ధానికి వ్యతిరేకంగా మోడీ గళం విప్పాలని డిమాండ్ చేశారు.

అమెరికాకు వ్యతిరేకంగా నిరసనలను అణచివేస్తున్న రేవంత్‌రెడ్డి : జాన్‌వెస్లీ

ఇరాన్‌పై అమెరికా సామ్రాజ్యవాదం చేస్తున్న దాడులను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఖండించారు. ప్రపంచ దేశాలపై పెత్తనం చెలాయించాలని చూస్తోందని విమర్శించారు. ఇరాన్‌పై దాడులను వెంటనే నిలిపేయాలని డిమాండ్ చేశారు. ఈ దాడులను మోడీ ఖండించాలని కోరారు. ఇరాన్‌లో అణ్వాయుధాలున్నాయనే పేరుతో వాటి అణుక్షేత్రాలపై దాడుల చేస్తున్నామంటూ అమెరికా ప్రకటించడం సరైంది కాదన్నారు. అక్కడ అణ్వాయుధాల్లేవంటూ అమెరికా ఇంటెలిజెన్స్ విభాగం నివేదిక ఇచ్చిందని గుర్తు చేశారు. దాడులు చేసే అధికారం అమెరికాకు ఎక్కడుందని ప్రశ్నించారు. ఐక్యరాజ్యసతిమి, అంతర్జాతీయ న్యాయస్థానాలున్నాయని చెప్పారు. ప్రపంచ పోలీసులాగా వివిధ దేశాలపై అమెరికా ఆధిపత్యం చెలాయించడం ఎంత వరకు సమంజసమని అడిగారు. ఇజ్రాయిల్‌కు మద్దతిచ్చి పాలస్తీనాను భయభ్రాంతులకు గురిచేసిందన్నారు. ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడులు చేసేలా సహకరించిందని అన్నారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం జరగడానికి అమెరికా సామ్రాజ్యవాదం కారణమని విమర్శించారు. ప్రపంచ దేశాల్లో యుద్ధాలు జరగడానికి కారణమవుతూ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నదని చెప్పారు. ఈ దాడులకు వ్యతిరేకంగా అమెరికా ప్రజలు కూడా వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ప్రపంచ దేశాలు వ్యతిరేకిస్తున్నా, ఐక్య రాజ్య సమితి ఆపాలని కోరినా అమెరికా పట్టించుకోవడం లేదన్నారు. ప్రజా సమస్యలను పక్కకు పెట్టి దోపిడీని కొనసాగించాలనే వ్యూహంతోనే ఇలాంటి దాడులకు పూనుకుంటున్నదని విమర్శించారు. సిఎం రేవంత్‌రెడ్డి ఇలాంటి నిరసన కార్యక్రమాలపై అణచివేత ధోరణితో వ్యవహరిస్తున్నారని చెప్పారు. అమెరికా కాన్సులేట్ వద్ద నిరసన తెలియజేయకుండా పోలీసులు దాడులు, దౌర్జన్యాలు చేశారని గుర్తు చేశారు.

సామ్రాజ్యవాదం అంటేనే యుద్ధం : సాదినేని

సామ్రాజ్యవాదం అంటేనే యుద్ధం, యుద్ధమంటేనే సామ్రాజ్యవాదమని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు సాదినేని వెంకటేశ్వరరావు విమర్శించారు. ప్రపంచ దేశాలపై పెత్తనం కోసం, వనరులను దోపిడీ చేయడం కోసమే యుద్ధం చేస్తున్నదని చెప్పారు.

ప్రపంచ పోలీసు పెత్తనాన్ని వ్యతిరేకించాలి : హన్మేష్

ఇంతకాలం పరోక్షంగా సహకరించిన అమెరికా ఇప్పుడు ఇరాన్‌పై ప్రత్యక్షంగా దాడులు చేస్తోందని సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం హన్మేష్ విమర్శించారు. ప్రపంచ పోలీసులా పెత్తనం చేస్తున్న అమెరికాను వ్యతిరేకించాలని కోరారు. ఎంసిపిఐ (యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ ట్రంప్ పాలనలో ప్రపంచంలో అశాంతి నెలకొందన్నారు. ఈ యుద్ధాలకు వ్యతిరేకంగా అమెరికాలోనే ప్రజలు నిరసనలు వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఎస్‌యుసిఐ (సి) రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ మురహరి మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాదం ప్రపంచ దేశాలపైనే కాకుండా మానవాళిపై దాడి చేస్తోందని విమర్శించారు. సోషలిజంలోనే ప్రపంచంలో శాంతి నెలకొంటుందని అన్నారు.

సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా, ఆర్ఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి జానకి రాములు, సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి ప్రసాదన్న మాట్లాడుతూ ప్రధాని మోడీ అమెరికా సామ్రాజ్యవాదానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇరాన్‌పై యుద్ధాన్ని ఆపేలా మోడీ ప్రయత్నించాలని కోరారు. సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం వెంకటేష్, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్ ఛాయాదేవి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు టి జ్యోతి, రాష్ట్ర కమిటీ సభ్యులు టి స్కైలాబ్‌బాబు, ఆర్ శ్రీరాంనాయక్, భూపాల్, ఉడుత రవీందర్, ఎం అడివయ్య, బుర్రి ప్రసాద్, సీనియర్ నాయకులు డిజి నరసింహారావు, సిఎస్ఎన్ మూర్తి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు విఎస్‌బోస్, సిపిఐ (ఎంఎల్), ఎస్‌యుసిఐ (సి) నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి బాలుడు మృతి

- మైలార్‌దేవ్‌పల్లి పిఎస్ పరిధిలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రమాదవశాత్తు ఆడుకుంటూ బావిలో పడి బాలుడు మృతిచెందిన ఘటన రంగారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన ఓ కుటుంబం బతుకుదెరువు కోసం కొంతకాలం క్రితం లక్ష్మిగూడలోని రాజీవ్ గృహకల్పలో నివాసం ఉంటున్నారు. ఈ దంపతుల కుమారుడు ప్రిన్స్ (5) మంగళవారం మధ్యాహ్నం ఇంటి పరిసరాల్లో ఆడుకుంటూ పక్కనే ఉన్న బావిలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే అతని కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బాలుడు కోసం ఇద్దరు గజ ఈతగాళ్ల సాయంతో నీటిలోకి దిగి గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. బావి లోతు ఎక్కువగా ఉండటంతో ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది సాయంతో బావిలోని నీటిని బయటకు తీసి, బాలుడు మృతదేహాన్ని బయటికి తీయడానికి పోలీసులు ప్రయత్నించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కబ్జాలపై సమాచారమివ్వండి..

- హైదరాబాద్ నగర ప్రజలకు హైడ్రా విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలో ఎక్కడైనా చెరువులు.. నాలాలు కబ్జాకు గురైతే సమాచారమివ్వాలని హైడ్రా ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. నగరంలో గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణకు హైడ్రా చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో మొదటి విడతగా నగరంలోని ఆరు చెరువులను పునరుద్ధరిస్తోంది. నగరానికి వరద ముప్పు తప్పించాలంటే గొలుసుకట్టు చెరువులు కీలక పాత్ర పోషిస్తాయి. వర్షం పడితే వరద నీరు రహదారులు, నివాస ప్రాంతాలను ముంచెత్తకుండా.. నేరుగా చెరువుల్లోకి చేరేలా హైడ్రా చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు చెరువులు, నాలాలు ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకుంటోంది. ఈ క్రతువులో నగర ప్రజల భాగస్వామ్యాన్ని కోరుతోంది. మీ పరిధిలో చెరువులు, నాలాలు కబ్జాకు గురవుతుంటే ఆ సమాచారాన్ని హైడ్రా వాట్సాప్ నంబరు 8712406899కు పంపాలని విజ్ఞప్తి చేసింది. ఫొటోలతో పాటు.. ప్రాంతాలను తెలియజేసే లొకేషన్‌ను షేర్ చేయాలని పేర్కొంది. కమిషనర్ హైడ్రా పేరిట ఉండే ట్విట్టర్ (ఎక్స్), ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ అకౌంట్‌లకు కూడా సమాచారం అందజేయాలని కోరింది.

సున్నం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోనే సియట్ లే ఔట్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి మండలాల సరిహద్దులోని గుట్టల బేగంపేట, అల్లాపూర్ గ్రామాల మధ్య ఉన్న సున్నం చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలోనే సియెట్(ఎస్ఐఇటి) లే ఔట్ వస్తోందని హైడ్రా స్పష్టం చేసింది. ఆ లే ఔట్‌కు సంబంధించి గతంలో హెచ్ఎండిఎ ఇచ్చిన డ్రాఫ్ట్ లే ఔట్‌ను కూడా ఇదే కారణంగా రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేసింది. ఇక్కడే గతంలో ఇంటి నిర్మాణానికి అనుమతిచ్చిన జిహెచ్ఎంసి కూడా ఆ అనుమతులను రద్దు చేసుకుందని తెలిపింది. ఇలాంటి పరిస్థితుల్లో తమకు న్యాయం చేయాలంటూ సియట్ లేఔట్ ప్లాట్ల యజమానులు సోమవారం ఆందోళన చేయడంలో అర్థం లేదని స్పష్టం చేసింది. దీనికి సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళ్తే.. సున్నం చెరువు 32.60 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. 1975లో సర్వే ఆఫ్ ఇండియా లెక్కలు ఇదే స్పష్టం చేస్తున్నాయి. గామ రికార్డుల్లో కూడా ఇదే విషయం స్పష్టమౌతోంది. అయినప్పటికీ హైకోర్టు ఆదేశాల మేరకు ఇరిగేషన్, రెవెన్యూ, జీహెచ్ఎంసీ విభాగాలతో కలిసి హైడ్రా సర్వే కూడా చేయించింది. అన్ని కోణాల్లో పరిశీలించాక.. సర్వే ఆఫ్ ఇండియా రికార్డుల్లో ఉన్న లెక్కలే తేలాయి. చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో, నాలాలను ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలను ఉపేక్షించొద్దని.. వెంటనే వాటిని తొలగించాలని కోర్టులు ఎప్పటికప్పుడూ స్పష్టం చేస్తున్న విషయాన్ని హైడ్రా గుర్తు చేస్తోంది. ప్రస్తుతం ఆ లే ఔట్‌లో ఎలాంటి నిర్మాణాలూ జరగలేదని పేర్కొంది. ఖాళీగా ఉన్న ప్లాట్లకు సంబంధించి అర్హులమని భావిస్తే నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాలని హైడ్రా సూచించింది. చెరువు పునరుద్ధరణ పనులకు ఆటంకం కలిగించొద్దని హైడ్రా విజ్ఞప్తి చేసింది.

మలబార్ గోల్డ్ 400 షోరూంలకు విస్తరణ

ప్రజాశక్తి - హైదరాబాద్

అతిపెద్ద రిటైల్ ఆభరణాల వ్యాపార సంస్థల్లో ఒకటైన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ కొత్త అవుట్‌లెట్‌ను తెరవడం ద్వారా 400 షోరూంలకు విస్తరించినట్లు వెల్లడించింది. నోయిడాలోని సెక్టార్ 18లో కొత్త షోరూమ్ ప్రారంభంతో ఈ మైలురాయిని చేరినట్లు తెలిపింది. ప్రస్తుతం రూ.63,000 కోట్ల టర్నోవర్‌ను కలిగి ఉన్నట్లు పేర్కొంది. 13 దేశాలలో కార్యకలాపాలు కలిగిన తమ సంస్థ ఆదాయాన్ని రూ.78,000కోట్లకు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుందని మలబార్ గ్రూపు ఛైర్మన్ ఎంపి అహ్మద్ పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 15 దేశాల్లో, భారత్‌లోని 22 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో తమ ఉనికిని విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

మాజీ సర్పంచి శంకరయ్య మృతి ప్రభుత్వ హత్యే

- కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి : సుర్వి యాదయ్యగౌడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం బీబీరాజ్‌పల్లి మాజీ సర్పంచి సర్పంచి దాసరి శంకరయ్య (55) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని తెలంగాణ సర్పంచుల సంఘం జెఎసి అధ్యక్షులు సుర్వి యాదయ్యగౌడ్ పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి కోటి రూపాయల పరిహారాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత శంకరయ్య రూ.పది లక్షలు అప్పు చేసి గ్రామంలో అభివృద్ధి పనులు చేయించారని, రెండేళ్ల గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో అప్పుల బాధ తట్టుకోలేక శంకరయ్య ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మాజీ సర్పంచులకు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

హైదరాబాద్ ఆర్ పి వొకు అరుదైన గుర్తింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఢిల్లీలో జరుగుతున్న ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారుల సమావేశం-2025లో హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయానికి అరుదైన గుర్తింపు దక్కింది. 2024-25 మధ్య కాలానికి గానూ ' సంస్కరణలు, ప్రజా సేవపట్ల నిబద్ధత' విభాగంలో హైదరాబాద్ ఆర్‌పిఒ (రీజినల్ పాస్‌పోర్టు ఆఫీస్) అవార్డు సాధించింది. ఈ అవార్డును మంగళవారం నిర్వహించిన 13వ పాస్‌పోర్టు సేవా దివస్ కార్యక్రమంలో విదేశాంగశాఖ సహాయమంత్రి పవిత్ర మార్గెరిటా ప్రదానం చేశారు. హైదరాబాద్ పాస్‌పోర్టు అధికారిణి జొన్నలగడ్డ స్నేహజ ఈ అవార్డు అందుకున్నారు. అంతేకుండా పాస్‌ఫోర్టు వెరిఫికేషన్‌లో ఉత్తమ సేవలు అందించినందుకుగానూ తెలంగాణ పోలీసు విభాగాన్ని కూడా సత్కరించారు. తెలంగాణ పోలీస్ తరపున ఇంటెలిజెన్స్ డిజి బత్తుల శివధర్‌రెడ్డి ఈ అవార్డు అందుకున్నారు.

బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు నష్టమేమీ లేదు

- కెసిఆర్, జగన్ హయాంలోనే తీసుకున్న నిర్ణయం
- టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణంతో తెలంగాణకు నష్టమేమీ లేదని, దీన్ని కావాలనే బిఆర్ఎస్ రాజకీయం చేయాలని చూస్తోందని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. తెలుగు రాష్ట్రాల అభ్యున్నతి కోసం పాటుపడే ఏపి సిఎం నారా చంద్రబాబు నాయుడుపై బురద చల్లే ప్రయత్నం చేయొద్దని తెలిపారు. గోదావరి జలాలు వృధాగా సముద్రంలో కలవకుండా బనకచర్ల ప్రాజెక్టు కట్టి రాయలసీమకు నీరందించేందుకు చంద్రబాబునాయుడు చూస్తున్నారన్నారు. ఈ నిర్ణయం కెసిఆర్, జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే తీసుకున్నారని, అప్పుడు తీసుకున్న నిర్ణయం ఇప్పుడు ఎలా తప్పు అవుతుందని ప్రశ్నించారు. బనకచర్ల ప్రాజెక్టు సమస్యను సామరస్యంగా ఇరు రాష్ట్రాల ప్రతినిధులు పరిష్కరించుకోవాలని సూచించారు. కానీ రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయంతో పబ్బం గడుపుకోవడం సరికాదన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో కెసిఆర్ పెద్దన్న పాత్ర పోషించి, ఆ నీటితో రాయలసీమకు నీరందించి రతనాల సీమగా మార్చుతానన్నారని గుర్తు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో జలవనరుల సమస్యలు ఉంటే కేంద్ర జల సంఘం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలి కానీ, మరొకరిపై నిందలు వేయడం బిఆర్ఎస్ నాయకులకు సబబు కాదన్నారు. సిఎం చంద్రబాబుకి తెలంగాణ రాష్ట్రానికి ఎటువంటి నష్టం చేసే ఉద్దేశం లేదన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్, టిడిపి కలిసి బనకచర్లపై హైదరాబాద్‌లో గానీ, ఢిల్లీ వేదికగా అఖిల పక్షం ఆధ్వర్యంలో చర్చిద్దామని తెలిపారు. లావాణి పట్టా భూములను అమ్ముకునే హక్కు కల్పిస్తామని మాట ఇచ్చిన కెసిఆర్ సంపన్నులకు కొమ్ము కాస్తు రక్షిత కౌలుదారు చట్టం ద్వారా వచ్చిన కాస్తు కాలంను కూడా ధరణిలో లేకుండా చేశారని ఆరోపించారు. తెలుగు రాష్ట్రాలకు 15 ఏళ్లు సిఎంగా పనిచేసిన చంద్రబాబుపై కెటిఆర్ మాట్లాడుతూ తెలంగాణ నుంచి రేవంత్ గురువును తరిమేశామనడం ఆయన అహంకారానికి నిదర్శనమని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు దాదె పోచయ్య, లక్ష్మీనారాయణ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహులు

పోస్టర్‌ను విడుదల చేస్తున్న కొండ సురేఖ తదితరులు

పండ్లు, పూల, ఔషధ మొక్కలకు ప్రాధాన్యం

- సామాజిక ఉద్యమంలా వన మహోత్సవం నిర్వహించాలి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఈ ఏడాది వనమహోత్సవాన్ని సామాజిక ఉద్యమంలా చేపట్టాలని, ఈ సారి పండ్లు, పూల, ఔషధ మొక్కలకు ప్రాధాన్యమివ్వాలని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధ్యక్షతన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు వన మహోత్సవం కింద పకడ్బందీ కార్యచరణ రూపొందించాలన్నారు. 2024లో 95 శాతం మేరకు అంచనాలను అందుకున్నామని వెల్లడించారు. ఈ సారి 100 శాతం లక్ష్యం పూర్తికావాలని దిశానిర్దేశం చేశారు.. ఇళ్లలో పెంచే గులాబీ, మందార, సీతాఫలం, జామ, ఉసిరి, అల్ల నేరేడు, మునగ, కానుగ, తులసి, ఈత మొక్కలతో పాటు పలు ఔషద మొక్కలు, పూల మొక్కలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు, రహదారులకిరువైపులా, పొలం, చెరువు గట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రయివేటు సంస్థలు, పరిశ్రమలు, కమ్యూనిటీ కేంద్రాలు, వైద్య శాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల ఆవరణల్లో పూల మొక్కలు నాటేందుకు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఈ దఫా వనమహోత్సవంలో ఈత, తాటి, వేప, చింత, కుంకుడు మొక్కలను ఎక్కువగా నాటించాలన్నారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటిన వారికి, నాటించడంలో కృషి చేసిన వారికి ప్రోత్సాహకాలు ఇవ్వాలని కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాల్లో పర్యవేక్షణ, సంప్రదింపుల కమిటీ సమావేశాలు నిర్వహించాలని సూచించారు.

ఎవరి ఆదేశాలతో ప్రభాకర్ రావు ఫోన్లు ట్యాపింగ్ చేశారు..?

- ఎంపి ఈటల రాజేందర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు ఎవరి ఆదేశాలతో ఫోన్లు ట్యాపింగ్ చేశారని మల్కాజిగిరి భాజపా ఎంపి ఈటల రాజేందర్ ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ ముందు వాంగ్మూలం ఇచ్చిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'మా పార్టీ నాయకుల మధ్య జరిగిన సంభాషణను కూడా కాల్ డేటాలో చూపించారు. హుజూరాబాద్‌లో, 2023లో గజ్వేల్‌లో పోటీ చేసినప్పుడు దుర్మార్గమైన పద్ధతిలో నా ఫోన్ ట్యాప్ చేశారు. మునుగోడు ఉప ఎన్నిక వచ్చినప్పుడు మేం.. ఎవరితో మాట్లాడుతున్నాం, ఏం చేస్తున్నామనేది ట్యాపింగ్ ద్వారా తెలుసుకున్నారు. ధైర్యంగా ఎదుర్కోలేని వారే ఇలాంటి అక్రమాలకు పాల్పడతారు. ప్రభాకర్‌రావు ఐపిఎస్ అధికారి కాదు. అయినా, ఎస్ఐబి చీఫ్‌గా నియమించారు. విశ్రాంత అధికారిని అక్రమంగా నియమించారు. మార్గదర్శకాలను తుంగలో తొక్కారు. ఫోన్లు ట్యాప్ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధం. జడ్జిలు, మంత్రులు, పార్టీ ముఖ్యనేతల ఫోన్లు ట్యాప్ చేశారు. గతంలో ఇంటెలిజెన్స్ మొత్తం కెసిఆర్ వద్దే ఉండేది. కాళేశ్వరంపై కమిటీ నివేదికను ఇంకా బయటపెట్టలేదు. ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ కమిషన్ వేసి ఏడాదిన్నర కావొస్తుంది. భారాస, కాంగ్రెస్ లాలూచీపడకపోతే విచారణ నివేదికలు ఎందుకు భయటపెట్టడంలేదో సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలి' అని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు.

ఎన్నికల సమయంలో తన రెండు ఫోన్లు ట్యాప్ చేశారని సిట్ అధికారులు చెప్పారని బిజెపి నేత ప్రేమేందర్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. రాజకీయ పార్టీ నేతలు, ఉద్యమకారులు, జర్నలిస్టులు, సినీ ప్రముఖుల ఫోన్ కాల్స్ వినడం దారుణమన్నారు. ఫోన్ ట్యాపింగ్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో విచారణ జరపాలి. బాధితులు వేల సంఖ్యలో ఉన్నారు. కానీ, కొద్ది మందిని మాత్రమే సాక్షులుగా పిలుస్తున్నారు. దేశ రక్షణ, భద్రత కోసం చేయాల్సిన ఫోన్ ట్యాపింగ్‌ను రాజకీయం కోసం వాడుకున్నారు. ఈ కేసులో అసలైన దోషులు తెలియాలంటే సిబిఐతో విచారణ చేయించాలి"అని అన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

భరోసా ఎగ్గొట్టేందుకే కాంగ్రెస్ ఎత్తుగడలు

- ఉప్పరిగూడలో రైతుల నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతాంగానికి ఇవ్వాల్సిన రైతు భరోసా ఎగ్గొట్టేందుకే కాంగ్రెస్ ఎత్తుగడలు వేస్తోందని రైతాంగం విమర్శించింది. తమకు భరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడ గ్రామ పంచాయతీ ఎదుట రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసీఆర్ తీసుకొచ్చిన రైతుబంధు సాగుకు భరోసా కల్పించిందని అన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను ఎగొట్టేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో సాగు చేస్తున్న రైతాంగం ఎక్కడి నుంచి పెట్టుబడి ఖర్చు తీసుకురావాలని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో రైతుబంధు ఇస్తే ఈ ప్రభుత్వం ఎందుకు కోత విధిస్తుందని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డబ్బులు అదనంగా పెంచి ఇవ్వకపోగా ఉన్న దాన్ని కోత విధిం చడమేంటని అన్నారు. ప్రాంతాలతో తారతమ్యం లేకుండా సాగు చేస్తున్న రైతాం గానికి పెట్టుబడి సాయం ఇవ్వాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ నరసింహారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కేబినెట్ తేల్చేదేం లేదు... నిర్ణయాలేవీ లేవు

- బిజెపి నేతలు కాసం వెంకటేశ్వర్లు, ఎస్ ప్రకాశ్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేబినెట్ మీటింగ్ తేల్చిదేం లేదనీ, ప్రజలు ఆశించిన నిర్ణయాలేవీ లేవని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్.ప్రకాశ్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేస్తుందనుకుంటే నిరాశే ఎదురైందన్నారు. రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు నిర్వహించకుండా వాటి పాలనను గాలికొదిలేశారని విమర్శించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. భూములమ్మనిదే రాష్ట్ర ప్రభుత్వానికి డబ్బులు దొరికే పరిస్థితి లేదని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై విచారణ ఎందుకు కోరడం లేదని ప్రశ్నించారు. ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డిని కేసీఆర్ కాపాడారనీ, ఇప్పుడు కాళేశ్వరం అవినీతిపై కేసీఆర్‌ను రేవంత్ కాపాడుతున్నారని ఆరోపించారు. దేశ చరిత్రలోనే కాళేశ్వరం ప్రాజెక్టు అతిపెద్ద కుంభకోణమనీ, రూపాయి ఖర్చులో రూ.52 పైసలు మాత్రమే ఖర్చుపెట్టారని కాగ్ రిపోర్టు ఎత్తిచూపిన అంశాన్ని ప్రస్తావించారు. దాసోజు శ్రవణ్ ఐరన్ లెగ్ అని విమర్శించారు. విలువైన ఖనిజాలను మైనింగ్ మాఫియాలకు, విదేశాలకు ఎగుమతి చేసి రూ. 500 కోట్ల పన్నును ఎగ్గొట్టిన వ్యక్తి గంగుల కమలాకర్ అని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో పాలనను నిర్వహించలేని అసమర్థ ప్రభుత్వం అని మరోసారి రుజువు చేసుకుందని విమర్శించారు. రెవెన్యూ సదస్సులు తూతూమంత్రంగా జరిగాయన్నారు.

టియుఎంహెచ్ఇయు సమ్మె నోటీస్ అందజేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (టియుఎంహెచ్ఇయు - సిఐటియు అనుబంధం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో కుటుంబ సంక్షేమ కమిషనర్, డైరెక్టర్ పబ్లిక్ హెల్త్, డిఎంఇ, వైద్య విధాన పరిషత్ కమిషనర్‌కు సమ్మె నోటీసులు నాయకులు అందజేశారు. దేశవ్యాప్తంగా జులై 9న సమ్మె చేయాలని కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. వైద్యాశాఖలోని ఉద్యోగులకు అందరికీ కనీస వేతనం రూ. 26 వేలుగా నిర్ణయించాలని, నాలుగు లేబర్ కొడ్స్‌ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని, నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులందరిని పర్మినెంట్ చేస్తూ వాళ్లకు జీతభత్యాలు పెంచాలని టియుఎంహెచ్ఇయు డిమాండ్ చేసింది. 104, 108 ఆరోగ్యశ్రీ సేవల్లో పని చేస్తున్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలనీ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ, బకాయి డీఏలు వెంటనే చెల్లించాలని కోరింది. రాష్ట్ర ప్రభుత్వ నుంచి రావలసిన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేసింది. ఈ డిమాండ్ల పరిష్కారం కోసం జూలై 9వ తేదీన సమ్మె అందరు పాల్గొనాలని పిలుపునిచ్చింది. ఈ సమ్మె నోటీసులను జిల్లా స్థాయిలోని అధికారులకు అందరికీ ఇవ్వాలని రాష్ట్ర నాయకులు కోరారు. సమ్మె నోటీసు అందజేత కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్, రాష్ట్ర అధ్యక్షులు ఎండి ఫసియొద్దీన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాద నాయక్, రాష్ట్ర కార్యదర్శి విజయవర్ధన రాజు, రాష్ట్ర కోశాధికారి ఎ కవిత, రాష్ట్ర కార్యదర్శి ఎ కిరణ్మయి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కుమారస్వామి, మహబూబ్‌నగర్ జిల్లా నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాసు, గద్వాల నాయకులు బీచ్పల్లి, ఖాజావలి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బడుల తనిఖీలకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలి

- సిఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డికి టిఎస్‌యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణ కోసం డిఇఒ, డిప్యూటీ ఇఒ, ఎంఇఒ, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులను వినియోగించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) ప్రభుత్వాన్ని కోరింది. అవసరమైన చోట కొన్ని అదనపు పోస్టులను మంజూరు చేయాలని, ప్రత్యేక యంత్రాంగం ద్వారా మాత్రమే పర్యవేక్షణ చేపట్టాలని సూచించింది. ఉపాధ్యాయులను పాఠశాలల పర్యవేక్షణ కోసం వినియోగించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ కలిసి వినతి పత్రం సమర్పించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల పర్యవేక్షణకు ఎంఈవో అకడమిక్ పోస్టును అదనంగా సృష్టించాలని కోరారు. ఉన్నత పాఠశాలల పర్యవేక్షణకు రెవెన్యూ డివిజన్‌కు ఒక ఉప విద్యాధికారిని నియమించాలని సూచించారు. అన్ని జిల్లాలకూ రెగ్యులర్ డీఈవోలను నియమించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను తనిఖీ అధికారులుగా నియమిస్తే క్యాడర్ సమస్యలు, సీనియార్టీ సమస్యలు వస్తాయని తెలిపారు. విద్యార్థులకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మండల రిసోర్స్ పర్సన్లుగా ఉపాధ్యాయులను నియమించినప్పుడు వచ్చిన ప్రతికూల ఫలితాలను దృష్టిలో ఉంచుకుని మరోసారి అటువంటి విఫల ప్రయోగాన్ని ఉపసంహరించుకోవాలంటూ సిఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

3న ఇందిరా పార్కు వద్ద సిపిఎస్‌యు కార్మికుల మహాధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ స్కీమ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ...జులై 9 సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ.. జులై 3న ఇందిరా పార్కు వద్ద సిపిఎస్‌యు కార్మికులు తలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె. వెంకటేష్ పిలుపునిచ్చారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌లోని బీడీఎల్ ఎదుట నిరసన చేపట్టారు. బిడిఎల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మురళి, టి. సత్తయ్య, కార్యనిర్వాహక అధ్యక్షులు శ్రీలక్ష్మి, ఆఫీస్ బేరర్లు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జె వెంకటేశ్ మాట్లాడుతూ..మోడీ సర్కారు కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను మరింత దూకుడుగా అమలు చేస్తోందని, సామాన్యులపై భారాలు మోపి, కార్పొరేట్ గుత్త సంస్థలకు, పెట్టుబడిదారులకు వేల కోట్ల రాయితీలు ప్రకటించి దేశ ఆర్థిక వ్యవస్థను లూఠీ చేస్తున్నదని విమర్శించారు. బీడీఎల్ పరిశ్రమలో ఔట్‌సోర్సింగ్ విధానాన్ని పెంచుతుందనీ, రైల్వే, రోడ్, ఎయిర్‌వేస్, డాక్-పోర్టులు, టెలికం తదితర మౌలిక రంగాల్లో 'నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్' పేరిట, 'నేషనల్ ఎస్సెట్ మానిటైజేషన్ పైప్ లైన్' పేరుతో లక్షల ఎకరాల భూములను కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా కట్టబెట్టడం అన్యాయమని అన్నారు. మురళి, సత్తయ్య మాట్లాడుతూ..సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ గేట్, గ్రూప్ మీటింగ్‌లు, లంచ్ అవర్ డిమాన్‌స్ట్రేషన్లు, కరపత్రాల అందజేత, లేబర్ కోడ్‌ల రద్దుపై సిఐటియు ముద్రించిన బుక్‌లెట్ల పంపిణీ వంటి తదితర రూపాల్లో ప్రచారాలు నిర్వహిస్తున్నామన్నారు.